క్లుప్తంగా

కాత్యాయనీదేవికి బంగారు కళ్లు సమర్పణ


కాత్యాయనీదేవి

రంగంపేట: చంద్రేడులో శ్రీ కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో అమ్మవారికి గ్రామానికి చెందిన జాస్తి పద్మరాజు, కమల దంపతులు రెండు గ్రాముల బంగారంతో అమ్మవారికి కళ్లు, వెండి సూత్రాల తాడు సమర్పించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కాత్యాయనీదేవికి వాటిని అలంకరించారు.

ఘనంగా స్వస్తి వాచకం


బలభద్రపురంలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీ ఆది వరాహ స్వామి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభించారు. మంగళవారం ఈ సందర్భంగా ఆలయం వద్ద స్వస్తివాచకం, గ్రామ సందర్శన, దీక్షాధారణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పుట్టమట్టితో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భారీగా అభిషేకాలు నిర్వహించారు. మఘమాసంలో మంగళవారం సందర్భంగా 58 మంది అభిషేకాలు చేసుకోవడంతో పాటు 800 మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో రామ లింగభాస్కర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైఫిల్ షూటింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన శ్రీజానకి


గోల్డ్‌మెడల్ సాధించిన శ్రీ జానకి

అనపర్తి: స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన బీజెడ్‌సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని నల్లమిల్లి శ్రీజానకి రైఫిల్ షూటింగ్ పిస్టల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పీ అబ్బాయిరెడ్డి తెలిపారు. ఈ నెల 23న ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన పోటీల్లో అనపర్తికి చెందిన శ్రీజానకి తన ప్రతిభతో గోల్డ్‌మెడల్ సాధించినట్టు చెప్పారు. ఆమె ఫిబ్రవరి 15న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లోని స్వామి వివేకానంద సబర్మతి యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా రైఫిల్ షూటింగ్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు తెలిపారు. శ్రీజానకి తండ్రి నల్లమిల్లి సత్తిరెడ్డి అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శ్రీజానకిని జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌ను చూపిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు

మధురపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలన్న లక్ష్యంతో మంగళవారం విద్యా భారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కోరుకొండ మండలం దోసకాయలపల్లి జెడ్పీ హైస్కూల్లోని 106 మంది విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యమిచ్చారన్నారు. నాడు – నేడు పథకం ద్వారా స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఇది సహించలేని ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ శీలం నాగ త్రినాథరావు, దోసకాయలపల్లి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసు, గాదరాడ హెచ్‌ఎం గణపతి, శ్రీరంగపట్నం హెచ్‌ఎం నరసింహరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వనుం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ బాలికా దినోత్సవం ప్రాముఖ్యతను హెచ్‌ఎం బీవీఎల్ఎన్ మూర్తి విద్యార్థులకు వివరించారు. బాలికలు తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలిపారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

పొగాకు సాగు.. లాభాలు బాగు

- రైతుల ఆసక్తి
- పెరుగుతున్న విస్తీర్ణం


వర్జీనియా పొగాకును సాగు చేస్తున్న దృశ్యం

రాజానగరం: సీతానగరం మండలంలోని నల్లరేగడి నేలలో పండించే వర్జీనియా పొగాకు సాగుపై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ పొగాకుకు సానుకూలత ఏర్పడంతోపాటు కంపెనీల నుంచి కూడా మంచి ప్రోత్సాహం లభిస్తుండటమే దీనికి ప్రధాన కారణం. మిర్తిపాడు, కాటవరం, ముగ్గళ్ల, రఘుదేవపురం, కూనవరం తదితర గ్రామాల్లోని 28,500 ఎకరాలలో వర్జీనియా పొగాకును సాగు చేస్తున్నారు. వరి, చెరకు, మొక్కజొన్న పంటల తరువాత ఇక్కడి రైతాంగం పొగాకు సాగుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది.

కంపెనీల ప్రోత్సాహం

ఇదే సమయంలో కంపెనీలు ఇచ్చే ప్రోత్సాహకాలు కూడా బాగుండటంతో వర్జీనియా పొగాకు సాగుపై రైతులు ఆసక్తిని పెంచుకోడానికి కారణమవుతుందని చెప్పవచ్చు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఈ ఏడాది వర్జీనియా పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ కేంద్రంలోని తొర్రేడు పరిధిలో గత ఏడాది 23 లక్షల కిలోల పొగాకును వేలంలో విక్రయించారు. ఈ ఏడాది 33 లక్షల కిలోలు పండించేందుకు గుంటూరు పొగాకు బోర్డు అనుమతి ఇవ్వడంతో గత ఏడాది కంటే 10 లక్షల కిలోల పొగాకును అధికంగా పండించేలా రైతులు సాగుకు సిద్ధమయ్యారు.

పెరిగిన ధర

వర్జీనియా పొగాకు సాగుపై ఆసక్తి ఏర్పడడానికి ధర పెరగడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. మూడేళ్ల క్రితం కిలో పొగాకు ధర రూ.138 ఉండేది. ఆ తరువాత రూ. 152 నుంచి ప్రస్తుతం రూ.168కి చేరింది. మంచి గ్రేడ్ ఉంటే మరికొంత ఎక్కువ ధర పలికే అవకాశాలున్నాయి. ఇదిలా వుండగా కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొగాకు సాగుకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. ఈ కారణంగా సగానికి పైగా దిగుబడులు పడిపోతాయని అక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో నల్లరేగడి నేలల్లో సాగు చేసే వర్జీనియాకు మంచి డిమాండ్ రావొచ్చని రైతాంగం అంచనా వేస్తుంది.

విస్తీర్ణం పెరిగింది

పండించిన పంటకు దిగుబడితో పాటు మంచి ధర రావాలని ప్రతి రైతు ఆశిస్తాడు. వర్జీనియా పొగాకు సాగు విషయంలో ఇటువంటి తృప్తి కలుగుతున్నందునే గతంలో కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగింది. సాగు ఖర్చులను, ఎరువులు, పురుగు మందుల ధరలను, కూలీల ఇబ్బందులను అధిగమించి సాగు చేస్తున్నాం. అంతర్జాయంగా కూడా మంచి డిమాండ్ ఉండటంతోనే పొగాకు సాగు పెరిగింది.

– కె. కాశీవిశ్వనాథ్, రఘుదేవపురం

బయటపడిన పురాతన విగ్రహం


పురాతన కాళీమాత విగ్రహం

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నం–శ్రీరామపురం రోడ్డును ఆనుకుని ఉన్న ఒక తోటలో పురాతన కాళీమాత విగ్రహం బయటపడింది. కొట్టి వెంకట్రావు అనే కౌలు రైతు సాగులో భాగంగా తోటలో వాటర్ పైపులైన్ వేసేందుకు కూలీలను పెట్టి తవ్విస్తుండగా అడుగున్నర గుండ్రటి రాతిపై చెక్కిన కాళీమాత రూపంతో ఉన్న విగ్రహం కనిపించింది. వెంటనే ఆ విగ్రహాన్ని బయటకు తీసి, చెట్టు కింద పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న భక్తులు అక్కడకు తరలివచ్చి పూజలు చేయడం ప్రారంభించారు.

పార్టీ విజయం కోసం సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

అనపర్తి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా అందరూ సమష్టిగా సైనికుల్లా పనిచేయాలని అనపర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల జేసీఎస్ ఇన్‌చార్జిలతో సమావేశాన్ని నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, మండల ఇన్‌చార్జిల నియామకాలు చేపట్టామన్నారు. ఈ వ్యవస్థ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ మూడున్నరేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి పార్టీ వారికి మరింత చేరువయ్యేలా బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా త్వరలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో గృహసారథుల నియామకాలు పూర్తి చేస్తామని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు వలంటీర్లకు సహాయంగా వీరు సేవలు అందిస్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఎన్నికల పరిశీలకుడు వరపుల సుబ్బారావులతోపాటు ఇటీవల అనపర్తి వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా నియమితులైన సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అడబాల వెంకటేశ్వరరావులను జేసీఎస్‌అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండల ఇన్‌చార్జిలు చిర్ల వీర్రాఘవరెడ్డి, బొడ్డు ముత్యాలరావు, కర్రి శ్రీవెంకటరెడ్డి, మేడిశెట్టి రవిశంకర్ సత్కరించారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మెటీరియల్ రికవరీ యూనిట్‌కు రామేశ్వరం ఎంపిక


రామేశ్వరంలో ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ హరికృష్ణ సత్యరెడ్డి

పెదపూడి: మెటీయల్ రికవరీ యూనిట్‌గా రామేశ్వరం గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్ కేంద్రాన్ని ఎంపిక చేశారని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి తెలిపారు. ఆయన రామేశ్వరంలోని ఘన వ్యర్థాల నిర్వహణ యూనిట్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. రికవరీ యూనిట్‌కు ఏ సౌకర్యాలు ఏర్పాటు చేయాలో సర్పంచ్ కొటికలపూడి చినబాబుకు సూచించారు. ఈఓపీఆర్డీ మాట్లాడుతూ రికవరీ యూనిట్ అంటే మండలంలోని ఇతర గ్రామాల్లో సేకరించిన ప్లాస్టిక్, గాజు వంటి వ్యర్థ పదార్థాలను ఇక్కడకు తీసుకొచ్చి బూడిద చేస్తారన్నారు. యూనిట్‌కు ఈ గ్రామం అనుకూలంగా ఉందన్నారు. ఈ మేరకు ఉన్నత అధికారులకు నివేదిక అందజేశానన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి అచ్చిరాజు ఉన్నారు.

కాపులను బీసీల్లో చేర్చాలి

సీతానగరం: కాపులను బీసీల్లోకి చేర్చాలని, ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురంశెట్టి మంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇనుగంటివారిపేటలో మండల కాపు సంఘం అధ్యక్షుడు సత్యం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కాపు సంఘం సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు మంగారావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జల్లె జోగిరాజు (నాని) పాల్గొన్నారు.

ఉల్లాసంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు


బ్యాటింగ్ చేస్తున్న రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

అనపర్తి: స్థానిక జీబీఆర్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ప్రభుత్వోద్యోగుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం రెండో రోజు జరిగిన పోటీల్లో డీఎంహెచ్‌ఓ–రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్(ఆర్‌ఎంసీ) జట్లు తొలి మ్యాచ్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌ఎంసీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 166 పరుగులు చేయగా డీఎంహెచ్‌ఓ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 60 పరుగులు మాత్రమే సాధించింది. ఆర్‌ఎంసీ జట్టులో బ్యాటింగ్ చేసిన రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ 58 పరుగులు చేసినట్లు పీడీ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం జీఎస్‌డబ్ల్యూఎస్–ఆర్‌ఎంసీ జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఆర్‌ఎంసీ జట్టు విజయం సాధించింది. రెవెన్యూ–ఎక్సైజ్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్స్‌లో రెవెన్యూ జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 138 పరుగులు సాధించగా ఎక్సైజ్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 95 పరుగులు సాధించింది. రెవెన్యూ జట్టులో కొవ్వూరు డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు 72 పరుగులు సాధించారు. బుధవారం ఆర్‌ఎంసీ–ఫైర్ శాఖల మధ్య సెమీఫైనల్ అనంతరం ఫైనల్స్ జరగనున్నాయి.

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి

- డీఈఓ అబ్రహం
- పుణ్యక్షేత్రం, సంపత్‌నగరంలో స్కూళ్ల సందర్శన


సంపత్ నగరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ అబ్రహం

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా రాసి, మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణులయ్యేందుకు సరైన ప్రణాళికతో పఠనం చేయాలని విద్యార్థులకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సూచించారు. మండలంలోని పుణ్యక్షేత్రం, సంపత్ నగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లోని రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును నిశితంగా పరిశీలించారు. నాడు – నేడు పనుల ప్రగతిని ఉపాధ్యాయులతో సమీక్షించారు.

అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు చేయాల్సిన కృషిపై అవగాహన కలిగించారు. పరీక్షలంటే ఉన్న భయాన్ని తొలగించుకోవాలన్నారు. ఇటీవల జరిగిన సమ్మెటివ్ 1 జవాబు, ప్రశ్న పత్రాలను పరిశీలించి కొన్ని సూచనలిచ్చారు. ప్రధానోపాధ్యాయులు జ్యోతి ప్రసాద్, సూర్యసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60 శాతం ఈ క్రాప్ నమోదు


దోమాడలో ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: రైతులు సాగు చేస్తున్న పంటకు సంబంధించి ఈ క్రాప్ నమోదు ప్రక్రియ మండలంలో 60 శాతం పూర్తయిందని మండల వ్యవసాయశాఖాధికారి టీ.వీ.ఆర్.మణిదీప్ అన్నారు. దోమాడలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18,000 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సుమారు 10,875 ఎకరాల్లో పూర్తయిందన్నారు. గ్రామ రెవెన్యూ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకుల సమక్షంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. పంట నమోదు సమయంలో పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్, రైతు వేసిన పంట రకం, కౌలుదారు కార్డు నకలు సమర్పించాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేయడంతో పంట నష్టం వచ్చినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ప్రధాన మంత్రి పసల్‌బీమా యోజన, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

రైతు భరోసా కేంద్రంలో విజిలెన్స్ తనిఖీలు

గోకవరం: కృష్ణునిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం రాజమహేంద్రవరం యూనిట్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కేంద్రంలో ఉన్న కియోస్క్ మెషీన్ పనితీరు, ఈ క్రాప్ నమోదు, రైతులకు అమలవుతున్న పథ కాల తీరు, రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా అమలు తీరును పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

శ్రీహరిబాబుకు పితృవియోగం


పట్టాభి రామయ్య (ఫైల్)

సీతానగరం: కాటవరానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు తండ్రి పట్టాభి రామయ్య (70) మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లి శ్రీహరిబాబును పరామర్శించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సంతాపం తెలిపారు.

రహదారుల భద్రతపై అవగాహన


పెదపూడిలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వాసు

పెదపూడి: రహదారుల్లో ప్రయాణించే వాహన చోదకులు తీసుకోవాల్సిన రవాణా భద్రత చర్యలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై పి.వాసు తెలిపారు. పెదపూడిలోని పోలీస్‌స్టేషన్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రత, రవాణాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రవాణా సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలపై వివరించారు. కఠినమైన చట్టాలు అమలులో ఉన్న నేపథ్యంలో అందరు కచ్చితంగా రహదారి భద్రత నిబంధనలు పాటించాలన్నారు.

నిత్యావసరాల వితరణ


వెలుగుబందలో సాయం అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: నియోజకవర్గంలోని వెలుగుబంద, దివాన్ చెరువు, శ్రీరామపురం, రూపానగర్, నిడిగట్ల, పాలచర్ల మున్నగు గ్రామాలలో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు చేయూత నందించారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ సంజీవని పథకంలో 26 కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం, నిత్యవసర వస్తువులను అందజేశారు.

బొమ్మను చేసి .. ప్రాణం పోసి..

- జీవం ఉట్టిపడుతున్న బొమ్మలు
- నైపుణ్యం చాటుతున్న రాజస్థానీలు


విక్రయాల కోసం సిద్ధం చేసిన బొమ్మలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యాభ్యాసానికి వారు దూరం.. పుట్టింది మొదలు సంచార జీవితమే.. ఎక్కడుంటే అదే వారి ప్రాంతం.. అక్కడే పొట్టకూటి కోసం బొమ్మల తయారీ.. కళాపోషకులు ఆదరిస్తే బతుకు.. లేదంటే పస్తు.. ఇదీ వలస వచ్చిన రాజస్థానీయుల జీవనం. దేవుడి చేతిలో ప్రాణులు జీవం పోసుకుంటే ఈ రాజస్థానీల చేతిలో దేవుని బొమ్మలు ప్రాణం పోసుకుంటున్నాయి. పుట్టపర్తి కేంద్రంగా కొంతకాలంగా రాజస్థానీయులు తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని బొమ్మల తయారీతో జీవనం సాగిస్తున్నారు.

జోధ్‌పూర్ నుంచి రాక..

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన పలువురు మూడు నెలల క్రితం రాజమహేంద్రవరం చేరుకున్నారు. పట్టణ శివారులో తాత్కాలిక గుడారం ఏర్పాటు చేసుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గృహాలంకరణ బొమ్మల తయారీ చేపట్టారు. వీరిలో ఏ ఒక్కరికీ అక్షరం ముక్కరాదు. తెలుగు అర్థం చేసుకుంటారు కానీ మాట్లాడడం రాదు. కేవలం రాజస్థానీ, హిందీ తప్ప మరో భాష రాదు. అయినా చేతిలో పని ఉంటే చాలు గౌరవంగా బతికేందుకు భాష అడ్డం రాదని నిరూపిస్తున్నారు. దాదాపు 50 రకాల బొమ్మలను జీవం ఉట్టిపడేలా తయారు చేస్తున్నారు. బొమ్మ పరిమాణాన్ని బట్టి రూ.100 నుంచి రూ.500 వరకూ విక్రయిస్తున్నారు.

ఆదరణ మరువలేం


సహజత్వం ఉట్టిపడుతున్న విగ్రహాలు


బొమ్మలకు రంగులు వేస్తున్న రాజస్థానీ మహిళ

తమ ప్రాంతానికి చెందిన అనేక కుటుంబాలు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో బతుకుతున్నాయని ఏకారామ్, దేవా తెలిపారు. పదేళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. చాలా పట్టణాలు, నగరాలు చుట్టేసి వచ్చినట్లు వివరించారు. ఎక్కడికి వెళ్లినా శివారు ప్రాంతంలోని విశాలమైన మైదాన ప్రాంతాన్ని అద్దెకు తీసుకుని గుడారం ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఏపీలోనే తమకు మంచి ఆదరణ ఉంటోందని, దీంతో నెలల తరబడి ఈ ప్రాంతంల్లోనే జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తయారైన విగ్రహాలను రోడ్డు పక్కన ప్రదర్శనకు ఉంచడం, మరికొన్నింటిని రిక్షాలలో వేసుకుని కాలనీల్లో తిరుగుతూ విక్రయిస్తున్నామన్నారు. పెట్టుబడులు పోను రోజుకు రూ.రూ.వెయ్యి నుంచి రూ.1500 మిగులుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ప్రభుత్వ స్థలాల్లో గుడారాలు వేసుకుని బొమ్మలు చేసుకునే అవకాశం కల్పిస్తే అద్దెభారం తగ్గుతుందని తెలిపారు.

జోరుగా మొక్కజొన్న సాగు


మునగాల గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

మధురపూడి: మెట్ట ప్రాంతమైన కోరుకొండ మండలంలో మొక్కజొన్న సాగు జోరుగా జరుగుతోంది.

మునగాల, కోటి, శ్రీరంగపట్నం, గుమ్ములూరు, బుచ్చెంపేట, కాపవరం గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల విస్తీర్ణంలో దీనిని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.1,750గా ఉంది. మొక్క దశలో ఉన్న పంటకు సాగునీరు, ఎరువులను రైతన్నలు సకాలంలో అందిస్తున్నారు.

26న షాపులకు సెలవు

రాజమహేంద్రవరం సిటీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలో షాపులు సెలవు పాటించాలని కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షాప్స్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్ట ప్రకారం సెలవు దినం కావున వర్తక సోదరులందరూ తమ షాపులను మూసివేయాలన్నారు.

మర్రిపూడిలో కల్వర్టు నిర్మాణం

రంగంపేట: మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద గల జగనన్న కాలనీకి వెళ్లే దారిలో ఉన్న కాలువ పై గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో కల్వర్టు నిర్మించారు. కాలువపై కల్వర్టు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండటంతో గ్రామ పంచాయతీ నిధులు లక్ష రూపాయలతో కల్వర్టు నిర్మాణం చేపట్టినట్టు సర్పంచ్ మాధవి తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాదయాత్ర విజయవంతం కావాలని పూజలు

గోకవరం: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ త్వరలో చేపట్టబోయే పాదయాత్ర విజయవంతం కావాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంగళవారం తంటికొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు పులువురు పాల్గొన్నారు.